# ఇండియన్ పాలిటీ

## భారత సుప్రీం కోర్టు – అధికారాలు

### న్యాయమూర్తుల తొలగింపు

**సుప్రీం కోర్టు న్యాయమూర్తుల తొలగింపు ప్రక్రియకు (అభిశంసన) మహాభియోగం అనే పేరు వాడుకలో ఉంది. అయితే రాజ్యాంగంలో ఎక్కడా ఈ పదాన్ని ఉపయోగించలేదు. రాష్ట్రపతి తొలగింపును మాత్రమే మహాభియోగంగా రాజ్యాంగంలో పేర్కొన్నారు.**

రాష్ట్రపతి ఒక ఉత్తర్వు ద్వారా సుప్రీం కోర్టు న్యాయమూర్తిని (124(4)) తొలగిస్తారు. అయితే పార్లమెంట్ అదే సమావేశంలో సమర్పించిన విన్నపం మేరకు మాత్రమే ఆయన ఈ ఉత్తర్వులు జారీ చేయాలి. ఈ విన్నపానికి పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక మెజారిటీ అవసరం.

★ ప్రత్యేక మెజారిటీ అంటే సభలోని మొత్తం సభ్యుల సంఖ్యలో మెజారిటీ, సభకు హాజరై, ఓటువేసే సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది ఆమోదం పొందాలి. దుష్ప్రవర్తన లేదా అసమర్థత అనే రెండు కారణాల ద్వారా మాత్రమే సుప్రీం కోర్టు న్యాయమూర్తిని తొలగించే వీలుంది.

★ ప్రకరణం 124(5) ప్రకారం పార్లమెంట్‌కు న్యాయమూర్తుల తొలగింపు ప్రక్రియను నియంత్రించే అధికారం ఉంది. దీనికి అనుగుణంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తుల చట్టం 1968 ను పార్లమెంట్ రూపొందించింది. ఈ చట్టం సుప్రీం కోర్టు న్యాయమూర్తులను అభిశంసన ప్రక్రియ ద్వారా తొలగించే విధివిధానాలను తెలియజేస్తుంది. అవి:

1. న్యాయమూర్తులను తొలగించే అభిశంసన (తొలగింపు) తీర్మానాన్ని 14 రోజుల ముందు నోటీసు ఇచ్చి, పార్లమెంట్ ఉభయసభల్లో దేనిలోనైనా ప్రవేశపెట్టవచ్చు. తీర్మానంపై లోక్‌సభలో కనీసం 100 మంది, రాజ్యసభలో 50 మంది సభ్యులు సంతకాలు చేసి, లోక్‌సభ అయితే స్పీకర్‌కు, రాజ్యసభ అయితే ఛైర్మన్‌కు పంపాలి.
2. స్పీకర్ లేదా ఛైర్మన్ ఈ తీర్మానానికి అనుమతి ఇవ్వచ్చు లేదా తిరస్కరించవచ్చు.
3. ఒకవేళ అనుమతిస్తే, సభాధ్యక్షులు దీనిపై ఒక కమిటీని ఏర్పాటు చేస్తారు.
4. ఈ కమిటీలో (ఎ) సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా ఒక సుప్రీం కోర్టు న్యాయమూర్తి (బి) ఒక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సి) ఒక ప్రముఖ న్యాయకోవిదుడు ఉంటారు.
5. సదరు న్యాయమూర్తిపై దుష్ప్రవర్తన లేదా అసమర్థత అభియోగం సమంజసమని ఈ కమిటీ అభిప్రాయపడితే, తన ప్రతిపాదనను పార్లమెంట్‌కు పంపుతుంది.
6. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఈ ప్రతిపాదనను ఉభయ సభలు విడివిడిగా ప్రత్యేక మెజారిటీతో ఆమోదించాలి. ఆ తర్వాత ఆరోపణలు ఎదుర్కొంటున్న న్యాయమూర్తిని తొలగించమని రాష్ట్రపతికి విన్నపం పంపాలి.
7. ఈ విన్నపం ఆధారంగా రాష్ట్రపతి ప్రత్యేక ఉత్తర్వు ద్వారా ఆ న్యాయమూర్తిని తొలగిస్తారు.

★ ఇంతవరకు ఏ సుప్రీం కోర్టు న్యాయమూర్తినీ అభిశంసన ప్రక్రియ ద్వారా తొలగించలేదు.

★ సుప్రీం కోర్టులో 1991–93 మధ్యకాలంలో న్యాయమూర్తిగా పనిచేసిన వి. రామస్వామిని దుష్ప్రవర్తన కారణంగా దోషిగా కమిటీ నిర్ధారించి, ఆయన్ని అభిశంసించాలని పార్లమెంట్‌ను కోరింది. అయితే లోక్‌సభ కాంగ్రెస్‌పార్టీ సభ్యులు ఓటింగ్‌కు హాజరు కాకపోవడంతో, సంబంధిత అభిశంసన తీర్మానం వీగిపోయింది.

★ అభిశంసన ద్వారా న్యాయమూర్తులను, మహాభియోగం ద్వారా రాష్ట్రపతిని తొలగిస్తారు. లేదా రాజ్యాంగ ధిక్కరణ అనే కారణంతో రాష్ట్రపతిని, దుష్ప్రవర్తన లేదా అసమర్థత కారణాలతో న్యాయమూర్తులను తొలగిస్తారు.

★ మహాభియోగ తీర్మానం రెండు సభల ఆమోదం పొందిన వెంటనే రాష్ట్రపతి తన పదవిని కోల్పోతారు. అభిశంసన తీర్మానం రెండు సభల ఆమోదం పొందితే సుప్రీం కోర్టు న్యాయమూర్తి పదవిని కోల్పోరు. రాష్ట్రపతి ఆ మేరకు ఉత్తర్వులు జారీచేసినప్పుడు మాత్రమే పదవిని కోల్పోతారు.

### న్యాయమూర్తుల జీతభత్యాలు (ప్రకరణ 125)

★ పార్లమెంట్ న్యాయమూర్తుల జీతభత్యాలను రెండో షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా, కాలానుగుణంగా నిర్ణయిస్తుంది. ఆర్థిక అత్యవసర పరిస్థితుల్లో తప్ప వీటిని మార్చకూడదు. ప్రస్తుతం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జీతం నెలకు లక్ష రూపాయలు. న్యాయమూర్తి జీతం నెలకు రూ. 90,000.

★ ఈ జీతభత్యాలను భారత సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. వీటికి ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది.

### న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం ప్రకరణ (124 (6))

★ మూడో షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా రాష్ట్రపతి సమక్షంలో లేదా ఆయన నియమించిన అధికారి ఎదుటగానీ న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం చేస్తారు.

★ రాజ్యాంగానికి అనుగుణంగా దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడతానని, ఎలాంటి భయం, పక్షపాతం, రాగద్వేషాలు లేకుండా తన విధులను సరైన పద్ధతిలో శ్రద్ధగా నిర్వహిస్తానని న్యాయమూర్తి ప్రమాణం చేస్తారు.

### సుప్రీం కోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నియామకం (ప్రకరణ (126))

రాష్ట్రపతి కింది సందర్భాల్లో తాత్కాలిక సుప్రీం కోర్టు న్యాయమూర్తిని నియమిస్తారు.

ఎ) భారత ప్రధాన న్యాయమూర్తి పదవి ఖాళీగా ఉన్నప్పుడు (లేదా)

బి) భారత ప్రధాన న్యాయమూర్తి తాత్కాలికంగా హాజరుకానప్పుడు (లేదా)

సి) భారత ప్రధాన న్యాయమూర్తి తన పదవీ బాధ్యతలను నిర్వహించడంలో అశక్తుడైనప్పుడు.

### సుప్రీం కోర్టు తాత్కాలిక న్యాయమూర్తుల నియామకం (ప్రకరణ 127)

సుప్రీం కోర్టు సెషన్ కొనసాగడానికి తగినంత మంది న్యాయమూర్తులు (కోరం) లేనప్పుడు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఒక హైకోర్టు న్యాయమూర్తిని సుప్రీం కోర్టులో తాత్కాలిక న్యాయమూర్తిగా నియమించవచ్చు. కానీ దీనికి రాష్ట్రపతి ముందస్తు అనుమతి ఉండాలి. అంతేకాకుండా సంబంధిత హైకోర్టు న్యాయమూర్తిని కూడా సంప్రదించాలి. ఈ విధంగా ఎంపిక చేసుకున్న న్యాయమూర్తికి సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియమించడానికి అవసరమైన అర్హతలు ఉండాలి. వీరి పదవీ కాలం 2 సంవత్సరాలు.

### పదవీ విరమణ చేసిన న్యాయమూర్తుల నియామకం (ప్రకరణ 128)

కొన్ని సందర్భాల్లో భారత ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన ఒక సుప్రీం కోర్టు న్యాయమూర్తిని లేదా పదవీ విరమణ చేసిన ఒక హైకోర్టు న్యాయమూర్తిని (సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా నియమించడానికి అర్హతలున్న వ్యక్తిని) సుప్రీం కోర్టు తాత్కాలిక న్యాయమూర్తిగా వ్యవహరించాల్సిందిగా కోరవచ్చు. అయితే ఈ విషయంలో రాష్ట్రపతి ముందస్తు అనుమతి, నియమించే వ్యక్తి సమ్మతిని తీసుకోవాలి. ఆయనకు రాష్ట్రపతి నిర్ణయించిన విధంగా జీతభత్యాలు లభిస్తాయి.

### సుప్రీంకోర్టు స్థానం (ప్రకరణ 130)

★ రాజ్యాంగం ప్రకారం సుప్రీం కోర్టు స్థానం ఢిల్లీలో ఉండాలి.

★ ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్రపతి అనుమతితో ఇతర ప్రదేశాల నుంచి కూడా కోర్టు కార్యక్రమాలను నిర్వహించడానికి ఆదేశాలను జారీ చేయవచ్చు.

★ ఇది కేవలం ఐచ్ఛికమేకానీ తప్పనిసరి కాదు. ఏ న్యాయస్థానం కూడా రాష్ట్రపతిని కానీ లేదా ప్రధాన న్యాయమూర్తిని కానీ వేరే స్థలాన్ని కేటాయించమని ఆదేశించకూడదు.

### సుప్రీం కోర్టు కోరం (ప్రకరణ 145(5))

★ ప్రకరణ 143 ప్రకారం రాష్ట్రపతి చేసిన రిఫరెన్సులు, రాజ్యాంగపరమైన కేసులను నిర్ణయించడానికి కనీసం అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఉండాలి. మిగిలిన కేసులను నిర్ణయించడానికి ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఉండాలి.

★ సుప్రీం కోర్టు తీర్పులను బహిరంగంగా ఓపెన్ కోర్టులో ఇస్తారు. తీర్పులన్నింటికి మెజారిటీ ఓటు ఉండాలి. తీర్పుల్లో తేడా ఉంటే న్యాయమూర్తులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చు.

## సుప్రీం కోర్టు స్వతంత్రత

★ సుప్రీం కోర్టు స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా తన విధులను నిర్వహించడానికి రాజ్యాంగం కొన్ని రక్షణలను కల్పించింది.

★ న్యాయస్థానంలోని సభ్యులను (సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు) సంప్రదించి రాష్ట్రపతి సుప్రీం కోర్టు న్యాయమూర్తులను నియమిస్తారు.

★ రాజ్యాంగంలో నిర్దేశించిన ప్రత్యేక పద్ధతి ద్వారా సుప్రీం కోర్టు న్యాయమూర్తులను తొలగిస్తారు (ఆర్టికల్ 124(4)). వారిని రాష్ట్రపతి నియమించినప్పటికీ, ఆయన అభీష్టం మీద వారి పదవీకాలం ఆధారపడదు.

★ ఆర్థిక అత్యవసర పరిస్థితుల్లో తప్ప వారి జీతభత్యాలు, హక్కులు, సెలవులు, పెన్షన్‌లను వారి ప్రయోజనాలకు వ్యతిరేకంగా మార్చకూడదు.

★ సుప్రీం కోర్టుకు సంబంధించిన అన్ని ఖర్చులను భారత సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. పార్లమెంట్ వీటిపై చర్చించవచ్చు కానీ, ఓటు వేయకూడదు (146 (3)).

★ న్యాయమూర్తులు తమ విధి నిర్వహణలో ప్రవర్తించే తీరును పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో చర్చించడాన్ని రాజ్యాంగం నిషేధిస్తుంది (ప్రకరణం 121). అయితే ఇది న్యాయమూర్తుల తొలగింపు తీర్మానానికి వర్తించదు.

★ పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులు భారత భూభాగంలో ఏ న్యాయస్థానంలోను న్యాయవృత్తిని ప్రాక్టీస్ చేయకూడదు (ప్రకరణం 124(7)).

★ న్యాయ ధిక్కారానికి పాల్పడిన వారిని శిక్షించే అధికారం సుప్రీం కోర్టుకు ఉంది (ప్రకరణ 129).

★ కార్యనిర్వాహకవర్గ ప్రమేయం లేకుండా భారత ప్రధాన న్యాయమూర్తి సుప్రీం కోర్టుకు కావాల్సిన సిబ్బందిని నియమించుకోవచ్చు. సిబ్బంది సర్వీసు నియమాలను కూడా ఆయనే నిర్ణయిస్తారు.

★ సుప్రీం కోర్టు అధికార పరిధి, అధికారాలను తగ్గించే అధికారం పార్లమెంట్‌కు లేదు. రాజ్యాంగం సుప్రీం కోర్టు పరిధికి హామీ ఇచ్చింది. అయితే పార్లమెంట్ సుప్రీం కోర్టు పరిధిని పెంచగలదు.

★ రాజ్యాంగం ప్రకారం కార్యనిర్వాహకశాఖ నుంచి న్యాయవ్యవస్థను వేరుచేయాలి (ప్రకరణం 50). అంటే కార్యనిర్వాహక అధికారులు న్యాయాధికారాలను కలిగి ఉండకూడదు.

★ సుప్రీం కోర్టు ద్వారా ప్రచురణకు నిషేధించిన లేదా కోర్టు ధిక్కారం కింద వచ్చే సమాచారాన్ని సమాచారహక్కు చట్టం కింద అడగకూడదు.

### ముఖ్యాంశాలు

★ సుప్రీం కోర్టులో ఉండాల్సిన కనిష్ఠ న్యాయమూర్తుల సంఖ్యను రాజ్యాంగంలో పేర్కొనలేదు.

★ సుప్రీం కోర్టు న్యాయమూర్తుల నియామకానికి ఉండాల్సిన కనిష్ఠ వయసును రాజ్యాంగంలో పేర్కొనలేదు.

★ సుప్రీం కోర్టు న్యాయమూర్తుల నిర్ణీత పదవీకాలం గురించి రాజ్యాంగం పేర్కొనలేదు.

★ సీనియర్ న్యాయమూర్తినే ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలనే నియమం రాజ్యాంగంలో లేదు.

★ సుప్రీం కోర్టు న్యాయమూర్తుల తొలగింపు అభిశంసన తీర్మానం ద్వారా జరుగుతుంది. మహాభియోగం ద్వారా కాదు.

★ సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల అభిశంసన ప్రక్రియ ఒక్కటే.

★ సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు ఒకే రకంగా ప్రమాణస్వీకారం చేస్తారు.

**రచయిత: షేక్ పీర్ సాహెబ్**

www.eenadupratibha.net